క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికి సహకరించండి



పటమట(విజయవాడతూర్పు):డివిజన్లలో సమస్యల పరిష్కారానికి అధికారులు కార్పొరేటర్లకు సహకారం అందించాలని వీఎంసీ వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ వెంకట సత్యం తెలిపారు. శుక్రవారం ఆయన వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లతో కలిసి వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్రను కలిశారు. తమ డివిజన్లలో ఉన్న సమస్యలపై, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్‌ను కోరారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరాన్ని అభివృద్ధి చేయటానికి తాను కౌన్సిల్ సభ్యులకు సహకరిస్తామని పేర్కొన్నారు.

హోంగార్డ్ కుటుంబాలకు ఆర్థిక చేయూత



విజయవాడస్పోర్ట్స్: జిల్లా పోలీస్ కమిషనరేట్ హోంగార్డ్స్ యూనిట్ నందు విధులు నిర్వర్తిస్తూ ఇటీవల మృతి చెందిన యాగంటి కోటేశ్వరరావు, మోహనరావు కుటుంబాలకు కమిషనరేట్‌లో పని చేస్తున్న తోటి హోంగార్డులు బాసటగా నిలిచారు. మృతుల కుటుంబాల ఆర్థిక ఆసరాకు హోంగార్డ్‌లు అందరూ కలిసి వారి ఒక్క రోజు వేతనాన్ని సమకూర్చారు. ఈ నగదు చెక్కులను పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు చేతుల మీదుగా కమిషనరేట్‌లో కోటేశ్వరరావు భార్య నాగలక్ష్మికి, మోహనరావు భార్య ప్రమీళకు ఒక్కొక్కరికి రూ. 5 లక్షల చొప్పున అందించారు.

శాకంబరీదేవీగా నాగమానసాదేవి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని లెనిన్ సెంటర్‌లోని ఓం శ్రీషిర్డీ నాగసాయిబాబా, నాగమానసాదేవి మందిరంలో శుక్రవారం అమ్మవారిని శాకంబరీదేవిగా అలంకరించారు. భక్తులు కూరగాయలు, పండ్లు, పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాస్వామి ఆధ్వర్యంలో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మందిరంలో మూడు రోజులపాటు శాకంబరీదేవి ఉత్సవాలు నిర్వహిస్తామని, ఆదివారం అన్నప్రసాద వితరణ జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వెన్నా ఆంజనేయులు, రమాదేవి దంపతులు, పద్మ, ఇందిర, భవానీ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): జక్కంపూడి కాలనీలోని విజేత ఇంగ్లీషు మీడియం స్కూల్లో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నారు. కంటికి సంబంధించి ఆయాన్ ఐ హాస్పటల్ ఆధ్వర్యంలో డాక్టర్ బషీర్ అహ్మద్ మయూఖ్ సేవలను అందించనున్నారు. బీపీ, షుగర్, థైరాయిడ్, కిడ్నీలో రాళ్ల వంటి సమస్యలకు ఫ్యామిలీ హాస్పటల్‌కు చెందిన డాక్టర్ సైరా భాను సేవలను అందించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ ఉచిత వైద్య శిబిరాలు ప్రజలకు అందుబాటులో ఉంటాయి. ఈ వైద్య శిబిరాలను హాస్పటల్స్ గౌరవధ్యక్షులు వావిలాల రజనీకాంత్ శర్మ పర్యవేక్షించనున్నారు.

భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):టీ తాగేందుకు బయటకు వెళ్లిన తన భర్త కనిపించకుండా పోయాడని భార్య కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా శుక్రవారం కేసు నమోదు చేశారు. చిట్టినగర్ బంక బుల్లాబ్బాయ్ వీధికి చెందిన చింతల అనసూయ, సూర్యనారాయణ భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కుమార్తెలు కాగా ఇద్దరికి వివాహాలయ్యాయి. గత నెల 29వ తేదీ ఉదయం సూర్యనారాయణ టీ తాగేందుకు బయటకు వెళ్లి తిరిగి రాలేదు. తెలిసిన వారిని, తోటి పని వారికి అడిగినా ప్రయోజనం లేకపోవడంతో భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ప్రేమ పేరుతో యువతికి వేధింపులు

అజిత్‌సింగ్‌నగర్: ప్రేమ పేరుతో యువతిని వేధింపులకు గురిచేసిన వ్యక్తిపై సింగ్‌నగర్ పోలీసు స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదు అయ్యింది. ఓ యువతి(28) సిటీ ఆర్థోపెడిక్ సెంటర్‌లో పనిచేస్తుంది. బందరు రోడ్డులోని ఓ గోల్డ్ షాప్‌లో పనిచేస్తున్న రేవంత్ అనే వ్యక్తి గత మూడు నెలల నుంచి ఆమె వెంటపడి ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. కొన్ని రోజుల క్రితం శిఖామణి సెంటర్‌లో యువతిని అడ్డగించి నేను నిన్ను ప్రేమిస్తున్నాను.. నువ్వు కూడా నన్ను ప్రేమించు లేకపోతే నిన్ను వదలిపెట్టనంటూ బెదిరించాడు. ఈ నెల ఒకటో తేదీన కూడా మరోసారి ఆమెను అడ్డగించి బెదిరించాడు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జగన్మాతా.. కాపాడమ్మా..





ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన దుర్గమ్మ సన్నిధిలో ఆషాఢ మాసోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు అమ్మవారికి సారె సమర్పించేందుకు తరలివస్తున్నారు. భక్త, భజన, ఆధ్యాత్మిక బృందాలు శుక్రవారం ఇంద్రకీలాద్రికి చేరుకొని దుర్గమ్మకు సారె సమర్పించారు. కొందరు మహిళలు మెట్ల పూజ చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. జగన్మాతా...మమ్మల్ని కాపాడమ్మా అంటూ భక్తులు అమ్మవారిని వేడుకుంటున్నారు. భారీగా తరలివచ్చిన భక్తులతో కొండంతా పండుగ వాతావరణం నెలకొంది.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ







బిల్డర్స్ సమస్యలను పరిష్కరించండి

భవానీపురం(విజయవాడపశ్చిమ):బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ (బాయ్) సభ్యులు నగర పాలక సంస్థ కమిషనర్ హెచ్ఎమ్ ధ్యానచంద్రను శుక్రవారం ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. బాయ్ ఏపీ చైర్మన్ అత్తలూరి నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో కలిసిన ధ్యానచంద్రకు పుష్పగుచ్ఛమిచ్చి అభినందనలు తెలిపారు. అనంతరం బిల్డర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి పరిష్కరించాలని కోరారు.

సానుకూలంగా స్పందించిన ఆయన సత్వరమే పరిష్కరించే దిశగా కృషి చేస్తానని చెపారు. కమిషనర్ ధ్యాచంద్రను కలిసినవారిలో బాయ్ అమరావతి సెంటర్ జనరల్ సెక్రటరీ బి.శివ కుమార్ పట్నాయక్, సివిల్ ఇంజినీర్ సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీ రాజశేఖర్, బిల్డర్స్ ఉన్నారు.



కమిషనర్ ధ్యాన్‌చంద్రను అభినందిస్తున్న బాయ్ సభ్యులు

పింగళి వెంకయ్య జీవితం స్ఫూర్తిదాయకం

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య 148వ జయంతిని విజయవాడ రైల్వే డివిజన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఆర్ఎం పీఈ ఎడ్విన్ రైల్వేస్టేషన్ సమీపంలోని పింగళి వెంకయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింగళి వెంకయ్య జీవితం నుంచి నేటి తరం ఎంతో విలువైన పాఠాలు నేర్చుకోవచ్చని తెలిపారు. అమితమైన దేశభక్తితో స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని నిస్వార్థమైన సేవలు అందించారని కొనియాడారు. జాతీయ పతాకం రూపకల్పనలో ఎంతో దూరదృష్టితో సర్వ మతాల సమ్మేళనం, సత్యం, అహింస అనే చిహ్నాలతో అందరి నుంచి ప్రశంసలు పొందారని కొనియాడారు. నేటి యువత ఆయన స్ఫూర్తితో దేశ సమైక్యత కోసం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలు విభాగాల అధికారులు, ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):కూరపాటి చంద్రశేఖరరావు పాఠశాలలో పింగళి వెంకయ్య 148వ జయంతి పాఠశాల ఆవరణలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ గానుగుల యుగంధరాచార్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తొలుత పింగళి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం యుగంధరాచార్య మాట్లాడుతూ పింగళి వెంకయ్య భట్లపెనుమర్రులో నిరుపేద రైతు కుటుంబములో జన్మించారన్నారు. 1921లో అఖిల భారత కాంగ్రెస్ సమావేశాలు బెజవాడలో జరిగినపుడు గాంధీజీ కోరిక మేరకు వెంకయ్య జాతీయ జెండాను రూపొందించారని చెప్పారు. వెంకయ్యను పత్తి వెంకయ్య అని, డైమండ్ వెంకయ్య అని జపాన్ వెంకయ్య అని పిలిచేవారన్నారు. ఆయన విద్య, వ్యవసాయ, శాస్త్రీయ రంగాల్లో చేసిన సేవలు అనిర్వచనీయమని కొనియాడారు. విద్యార్థులకు పింగళి వెంకయ్య జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు పాఠశాల కార్యదర్శి బహుమతులు అందజేశారు.



పింగళి వెంకయ్య విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఏడీఆర్ఎం ఎడ్విన్



పింగళి వెంకయ్యకు నివాళులర్పిస్తున్న విద్యార్థులు

తల్లి పాలు బిడ్డకు అమృతంతో సమానం

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రశాంతి

భవానీపురం(విజయవాడపశ్చిమ): తల్లి పాలు బిడ్డకు అమృతంతో సమానమని, బిడ్డ పుట్టిన గంటలో తల్లి పాలు తాగించటం అన్ని విధాల శ్రేయస్కరమని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ - 1, సెక్టార్ -1 సూపర్‌వైజర్ జి.ప్రశాంతి తెలిపారు. తల్లి పాల వారోత్సవాలను పురస్కరించుకుని భవానీపురం హౌసింగ్‌బోర్డ్‌కాలనీలోగల అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమానికి హాజరైన గర్భిణులు, బాలింతలను ఉద్దేశించి మాట్లాడుతూ బిడ్డ పుట్టగానే వచ్చే ముర్రు పాలు తాగించటం వలన వాటిలో ఉండే పోషకాలతో భవిష్యత్‌లో వచ్చే రోగాల నుంచి రక్షణ పొందుతారని చెప్పారు. తల్లి పాలలో ఉండే పోషక గుణాలు మరే ఇతర పాలల్లో ఉండవని స్పష్టం చేశారు. బిడ్డ పుట్టిన ఆరు నెలల వరకు తల్లి పాలే తాగించాలని, తద్వారా వారిలో మానసిక వికాసం పెంపొందేందుకు దోహదం చేస్తుందని పేర్కొన్నారు. బిడ్డకు పాలు తాగించటం వలన అందం, శరీరాకృతి పాడైపోందన్న అపోహ సరికాదని, తల్లి తన పాలను ఇచ్చినప్పుడే ఇద్దరూ ఆరోగ్యంగా ఉంటారని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సుభాషిణి, అమిత, ఉమాదేవి, గాయత్రి, వరకుమారి, మహిళా పోలీసులు, ఏఎన్ఎమ్‌లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రశాంతి

కల్వర్టు నిర్మాణ పనుల పరిశీలన

భవానీపురం(విజయవాడపశ్చిమ):పశ్చిమ నియోజకవర్గం విద్యాధరపురం 38వ డివిజన్ పరిధిలో లోటస్ లెజండ్ అపార్ట్‌మెంట్ దగ్గర నుంచి పున్నమి హోటల్ వైపు జరుగుతున్న కల్వర్ట్ పనులను స్థానిక వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా శుక్రవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇక్కడ అవుట్‌ఫాల్ డ్రెయిన్‌పై గతంలో ఉన్న కల్వర్ట్ దెబ్బతిని కుంగిపోయిందని చెప్పారు. స్థానికుల రాకపోకలకు ఇబ్బందికరంగా ఉండటంతో సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా రూ.8లక్షలు మంజూరు చేశారని పేర్కొన్నారు. ఆ నిధులతో ప్రజలకు ఎటువంటి అసౌకర్యం లేకుండా పనులు ప్రారంభించామని తెలిపారు. ప్రజలు ఎదుర్కొనే ప్రతి సమస్యను సత్వరమే పరిష్కరించే విధంగా ముందుకు వెళుతున్నామన్నారు. డివిజన్‌లో ప్రజలకు ఎదురయ్యే సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని చెప్పారు.



కల్వర్ట్ పనులు పరిశీలిస్తున్న రెహమతున్నీసా

అధినేతతో ఆత్మీయ భేటీ



వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, సెంట్రల్ మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తదితరులు కలిశారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

పరిశ్రమల్లో ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి శంకర్ డిమాండ్



ఇబ్రహీంపట్నం: పరిశ్రమలు, క్వారీల్లో ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ డిమాండ్ చేశారు. స్థానిక రింగ్ సెంటర్‌లో ప్రమాదాల నివారణ చర్యలపై అసలత్వం వహిస్తున్న అధికారుల తీరుపై సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన నిర్వహించారు. శంకర్ మాట్లాడుతూ పరిశ్రమలు, క్వారీల్లో ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో జోగడం వలన కార్మికుల ప్రాణాలు గాలిలో కలిసి పోతున్నాయని విమర్శించారు. ఇటీవలి కాలంలో పొట్టకూటి కోసం పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులు ఎన్టీటీపీఎస్, పవన్ గ్రానైట్ మెటల్ క్వారీలో జరిగిన ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. నాసిరకం జెలిటిన్ స్టిక్స్ ఇచ్చి కొండలు పగల కొట్టించడంతో కార్మికుల ప్రాణాలు బండరాళ్లల్లో కలిసిపోవడం బాధాకరమన్నారు. కార్మికులకు కనీస రక్షణ పరికరాలు ఇవ్వకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్కో కార్మికుడికి సుమారు రూ.17 లక్షల వరకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనధికార క్వారీలపై అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై ధ్వజమెత్తారు. ఎన్టీటీపీఎస్, కొండపల్లి ఐడీఏలో కాలుష్య నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్ కోటేశ్వరరావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్రబాబు, జిల్లా నాయకులు బుడ్డి రమేష్, సుబ్బయ్య, యల్లమందారావు తదితరులు పాల్గొన్నారు.

కమిటీ కుర్రోళ్లు అందరినీ ఆకట్టుకుంటుంది

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఈ నెల 9న విడుదల కానున్న కమిటీ కుర్రోళ్లు చిత్రం ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటుందని ఆ చిత్ర నిర్మాత కొణిదెల నిహారిక అన్నారు. ఈ చిత్రాన్ని 90లో కిడ్స్ భావోద్వేగాలను తెలుపుతూ దర్శకుడు యదు వంశీ చిత్రీకరించారని తెలిపారు. ప్రతి ఒక్కరూ వీక్షించి తమను ఆదరించాలని కోరారు. చిత్ర ప్రమోషన్‌లో భాగంగా ఆ సినిమా యూనిట్ సభ్యులు శుక్రవారం నగరానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఓ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నిర్మాత నిహారిక మాట్లాడారు. ఈ సినిమాతో 20 మంది కొత్త కుర్రోళ్లకు ఇండస్ట్రీకి పరిచయం అవుతున్నారని చెప్పారు. ఈ సినిమా ట్రైలర్ అందరినీ ఆకట్టుకున్నట్లు పేర్కొన్నారు. కమిటీ కుర్రోళ్లు కోసం మూడేళ్లుగా పనిచేస్తూనే ఉన్నట్లు తెలిపారు. డైరెక్టర్ యదు వంశీ మాట్లాడుతూ విలేజ్‌లో కొంత మంది చిన్నప్పటి నుంచి టీనేజ్, యువకులుగా మారే స్థాయి వరకూ వివిధ దశల్లో వారి మధ్య చోటుచేసుకున్న సంఘటన నేపథ్యంలో ఈ చిత్రాన్ని రూపొందించినట్లు తెలిపారు.



మీడియాతో మాట్లాడుతున్న చిత్ర నిర్మాత నిహారిక, పక్కన దర్శకుడు యదు వంశీ తదితరులు

దుర్గమ్మ సన్నిధిలో నటి నిహారిక

ఇంద్రకీలాద్రి: సినీనటి, నిర్మాత నిహారిక శుక్రవారం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన నిహారికను ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందచేయగా, ఆలయ ఈవో రామరావు అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు.



నిహారికకు అమ్మవారి చిత్రపటం అందచేస్తున్న ఈవో రామరావు

డ్రైడే-ఫ్రైడేలో భాగస్వాములు కావాలి

డీఎంహెచ్‌వో డాక్టర్ సుహాసిని

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):డ్రైడే-ఫ్రైడేలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ యం. సుహాసిని పిలుపునిచ్చారు. శుక్రవారం 46వ డివిజన్ భీమన వారి పేట, జక్కంపూడి కాలనీలో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకునే ముందస్తు చర్యల్లో భాగంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కాలనీలో ప్లాట్ల వద్ద ఉన్న పూలకుండీలు, పనికి రాని ఫ్రిజ్‌లు, ప్లాస్టిక్ గ్లాసులు, కొబ్బరి బొండాల్లో వర్షం నీరు నిల్వ ఉండటం వల్ల దోమల లార్వా ఏ విధంగా వ్యాప్తి చెందుతుందో వివరించారు. ఇంటి పరిసరాల్లో వర్షం నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం ద్వారా వాతావరణంలో జరిగే మార్పులతో వచ్చే వ్యాధులను అరికట్టవచ్చునని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతీబాబు, డెప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఇందుమతి, కొండపల్లి వైద్యాధికారి డాక్టర్ పద్మావతి, వెలగలేరు వైద్యాధికారి డాక్టర్ సుష్మా, డాక్టర్ శ్రావణి, మలేరియా పర్యవేక్షకులు పాల్గొన్నారు.



నీటి తొట్టెల్లో దోమల లార్వాను పరిశీలిస్తున్న సుహాసిని, ఇతర అధికారులు

విద్యార్థులు క్రీడల్లో రాణించేందుకు కృషి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):విద్యార్థులు క్రీడాల్లో మరింత రాణించేందుకు కృషి చేయాలని పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ తెలిపారు. ఆ కళాశాల క్రీడా విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రీమియం లీగ్ పోటీలను అమర్‌సుధీర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కళాశాల క్రీడా విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులను ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. వివిధ రకాల క్రీడల్లో మంచి క్రీడాకారులుగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. ఈ నెల 12వ తేదీ వరకూ పోటీలు కొనసాగుతాయని చెప్పారు. కార్యక్రమంలో కోశాధికారి కె.రాఘవయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.పతంజలిశాస్త్రి, క్రీడా విభాగాధిపతి ఎంవిక్టర్ జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న చిట్టా అమర్ సుధీర్

బాపు మ్యూజియంలో చేనేత హస్తకళా ప్రదర్శన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆషాఢ, శ్రావణ మాసాలను పురస్కరించుకుని బందరు రోడ్డులోని బాపు మ్యూజియంలో చేనేత హస్తకళా ప్రదర్శన ప్రారంభమైంది. ఈ ప్రదర్శనను మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ ప్రారంభించారు. ప్రదర్శన, అమ్మకాలు సెప్టెంబర్ 8వ తేదీ వరకు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ప్రదర్శనలో పోచంపల్లి, నారాయణ్‌పేట, ఉప్పాడ, చీరాల, మంగళగిరి, కలంకారీ, ఫ్యాన్సీ, ఖాదీ, కాటన్ ప్రింటెడ్, బెంగాల్ సిల్క్, కాంత్ వర్క్ కాటన్, భాగల్‌పూర్ సిల్క్, బాంధనీ సిల్క్, గుజరాత్ డిజైన్ టాప్స్, లక్నో చికన్ వర్క్, డోర్ కర్టెన్స్, డోర్ మ్యాట్స్, వరంగల్ టవల్స్, బెడ్‌షీట్స్, రాజస్థానీ ప్రింటెడ్ టాప్స్, జైపూర్ టాప్స్, బెడ్‌షీట్స్, ఖాదీ షర్ట్స్, సాహరన్‌పూర్ ఉడ్ ఐటెమ్స్ అందుబాటులో ఉన్నాయన్నారు.

5న పేరంటాలమ్మ శ్రావణమాస పూజలు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో ఈనెల 5 నుంచి శ్రావణమాస విశేష పూజలు ప్రారంభమవుతాయని ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి తెలిపారు. శ్రావణ మాసం సందర్భంగా నిర్వహించే పూజలు సెప్టెంబరు 3 వరకూ జరుగుతాయన్నారు. ఈ నెల రోజులు పరోక్షముగా పూజలు జరుగుతాయని, మాసాంతరం అమ్మవారి ప్రత్యేక ప్రసాదం, కుంకుమ, అక్షింతలు భక్తులకు అందజేస్తామని వివరించారు. స్వయంగా రాలేని భక్తులకు పోస్టు, కొరియర్ ద్వారా ప్రసాదము అందజేయనున్నట్లు తెలిపారు.

దశలవారీగా అభివృద్ధి పనులు చేపడతాం



భవానీపురం(విజయవాడపశ్చిమ):విద్యాధరపురం 44వ డివిజన్ పరిధిలోని చెరువు సెంటర్, అప్పలస్వామి క్వారీ, రామరాజ్యనగర్ ప్రాంతాలలో నగరపాలక సంస్థ సర్కిల్-1 జోనల్ కమిషనర్ రమ్య కీర్తన, పలువురు అధికారులతో కలిసి శుక్రవారం పర్యటించారు. ఆయా ప్రాంతాల స్థానికులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులను దశలవారీగా చేపడతామని తెలిపారు. తాగునీరు, వీధి దీపాలు, డ్రెయిన్ల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సత్వరం పరిష్కరిస్తామని చెప్పారు. డివిజన్‌లో ఏ సమస్య ఎదురైనా భవానీపురంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో తెలియ చేయాలని సూచించారు. స్థానిక ఎమ్మెల్యే వై.సుజనా చౌదరి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ పర్యటనలో పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, నగరపాలక సంస్థ ఏఈ రవీంద్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాలరావు, వాటర్ ఏఈ అహ్మద్, కూటమి నాయకులు బి.శ్రీనివాసరావు, లింగం శివప్రసాద్, లింగాల అనిల్ పాల్గొన్నారు.